క్లుప్తంగా

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి జెడ్పీ హైస్కూల్లో శిక్షణ పొందుతున్న జిల్లా హ్యాండ్ బాల్ జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులను గురువారం ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు అందజేశారు. హెచ్‌ఎం లగిశెట్టి సత్యనారాయణ, ఉప సర్పంచ్ శ్రీను, బచ్చుపల్లి రామలింగారావు పాల్గొన్నారు.

నేడు మహిళలకు వైద్య పరీక్షలు

నల్లగొండ టూటౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నీలగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు మహిళలకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఐఎంఏ భవన్‌లో మున్సిపల్ మహిళా ఉద్యోగులకు, కార్మికులకు, పొదుపు సంఘాల మహిళలకు ఉచితంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వీ. రమణాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరడ విద్యార్థికి జిల్లా స్థాయి రెండో ర్యాంకు



కర్నాటి శృతి

చిట్యాల : మండలంలోని నేరడ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కర్నాటి శృతి ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్) ప్రతిభ పరీక్షలో 144 మార్కులతో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాంకు సా ధించిన విద్యార్థిని శృతిని ఆ పాఠశాల ఉపాధ్యా యులు అభినందించారు. ఐదేళ్లుగా ఈ పాఠశాల విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభ ప రీక్షలో ర్యాంకులు సాధిస్తున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

శాలిగౌరారం : మండలంలోని పెర్కకొండారం గ్రామంలో జీనెక్స్‌సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పెర్కకొండారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను గురువారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, సూర్యాపేట జిల్లా పోలీస్ అధికారుల సంఘం, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రయ్యగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

నల్లగొండ క్రైం : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేతను చంపుతామని బెదిరిస్తున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎన్‌ఎస్‌యూఐ, టీఎస్‌యూ నాయకులు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చంపుతామని బెదిరించిన వీడియో, ఆడియోలతో కూడిన ఆధారాలను పోలీసులకు అందజేసినట్లు విద్యార్థి సంఘాల నాయకులు నాగార్జున, కత్తుల చందన్ తెలిపారు.

చిట్యాలకు చేరుకున్న పాదయాత్ర

చిట్యాల : మునుగోడు నుంచి వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర గురువారం చిట్యాల మండలంలోని తాళ్ళవెల్లంల గ్రామం మీదుగా చిట్యాలకు చేరుకుంది. ఈ పాదయాత్రలో సంఘం రాష్ట్ర కార్యదర్శి అంబాల శ్రీధర్‌గౌడ్, కన్వీనర్ ముదం చిరంజీవి, సత్యనారాయణ, నార్ల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



అన్నప్రాసన చేయిస్తున్న అధికారులు

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు బిడ్డలకు తల్లిపాలే ఇవ్వాలని, ఆరు నెలలు నిండిన తరువాత అనుబంధ పోషకాహారం అందించాలని అన్నారు. మూడు సంవత్సరాల వరకు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే బాలామృతాన్ని తప్పకుండా పిల్లలకు తినిపించాలని తల్లులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి మాలతి, అంగన్‌వాడీ టీచర్ శారద పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

కేతేపల్లి : మండలంలోని భీమారం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్ గురువారం ప్రారంభించారు. ఉప సర్పంచ్ జి.స్వప్న, మండల వైద్యాధికారి సత్యనారాయణ, సీహెచ్‌ఓ సుందర్ నాయక్, కార్యదర్శి సైదులు, బీఆర్‌ఎస్ నాయకులు ఫరీద్, నాగరాజు, విష్ణు, బాలకృష్ణ, మాతంగి రాములు, సత్యం పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణం

- మునుగోడు సబ్ డివిజన్‌కు రూ.27 కోట్లు మంజూరు
- దాదాపు అన్ని గ్రామాల్లో జరుగుతున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



మునుగోడులో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

మునుగోడు : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతి ఏటా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను సీసీ రోడ్లకు మార్చి మాసంలో కేటాయించేది. ఆ పనులను అదే నెలలో పూర్తి చేసేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇబ్బందులు పడేవారు. అయితే ఆ నిధులు ఈ ఏడాది జనవరి మొదటి వారంలో కేటాయించడంతో సీసీ రోడ్ల పనులను ఇప్పటికే దాదాపు 50 శాతంకు పైగా పూర్తి చేశారు.

మునుగోడు సబ్ డివిజన్‌కు రూ. 27 కోట్లు మంజూరు

మునుగోడు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు ఈ ఏడాది సీసీ రోడ్లకు గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల నుంచి రూ.27 కోట్లను జనవరి మొదటి వారంలో మంజూరు చేసింది. అందులో మునుగోడు మండలానికి రూ.7.28 లక్షలు, చండూరు 6.20 లక్షలు, మర్రిగూడ 6.60 లక్షలు, నాంపల్లి 6.95లక్షల చొప్పున మంజూరయ్యాయి. అందులో ఇప్పటివరకు రూ.13.49 లక్షల విలువ గల పనులు చేశారు. మిగిలిన పనులు ఈ నెల 31 తేదీ లోపు పూర్తిచేసి ఎంబీలు రికార్డు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ పనులను సైతం పూర్తి చేయించేందుకు అధికారులు, స్థానిక ఎమ్మెల్యే సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంజూరైన నిధులు మొత్తం ఖర్చు చేయించి గ్రామాల్లోని అన్ని వీధుల్లో రోడ్లు వేసేలా కృషి చేస్తున్నారు.

గతంలో రూ. 7 కోట్లకు మించి మంజూరు కాని నిధులు

నాలుగైదు ఏళ్లగా మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి మునుగోడుకు రూ.5 కోట్ల నుంచి రూ. 7 కోట్లకు మించి మంజూరు కాలేదు. ఈ ఏడాది మాత్రం రూ. 27 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి నియోజకవర్గానికి రూ.5 కోట్ల నుంచి రూ. 6 కోట్ల వరకు మంజూరు చేసింది. ఉప ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయించింది. గతంలో ఒక్కో గ్రామానికి రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేస్తే ఈ ఏడాది రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు మంజూరు చేశారు. ప్రతి గ్రామంలోని దాదాపు 80 శాతం వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. గ్రామాల్లోని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.40 లక్షలు మంజూరయ్యాయి



మా గ్రామానికి ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా సీసీ రోడ్లు వేసేందుకు రూ. 40 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో దాదాపు 16 ప్రధాన వీధుల్లో రోడ్లు వేస్తున్నాం. ఇప్పటికే రూ.30 లక్షల విలువ గల పనులు పూర్తి చేశాం. మిగిలిన రూ.10 లక్షల విలువ గల పనులు కూడా పూర్తి చేస్తాం. దీంతో గ్రామంలోని దాదాపు 90 శాతం వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తవుతుంది.

-కంచి జ్యోతి, సర్పంచ్ గూడపూర్

మార్చి చివరినాటికి పూర్తి చేయిస్తాం

ఈ ఏడాది ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 27 కోట్లు మంజూరయ్యాయి. అందులో ఇప్పటికే సగానికిపైగా పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లకు సూచిస్తున్నాం. ప్రతి గ్రామంలో పనులు కొనసాగుతున్నాయి. మార్చి చివరి నాటికి నూరుశాతం పనులు పూర్తి చేయిస్తాం.

-బి. రఘుపతి, డీఈ, మునుగోడు సబ్ డివిజన్

యూటీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

మునుగోడు : హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ తరపున బరిలో నిలిచిన అభ్యర్థి మాణిక్‌రెడ్డి గెలిపించాలని కోరుతూ ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరమాళ్ళ వెంకటేషం గురువారం కిష్టాపురం, ఊకొండి, పులిపలుపుల పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు గేర నర్సింహ, వెంకన్న, మునుగోడు మండల అధ్యక్షుడు పెరిక నర్సింహ, లక్ష్మీనారాయణరెడ్డి, యాదగిరిరెడ్డి, పాండు, నర్సింహ పాల్గొన్నారు.

చిట్యాల : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ నాయకులు గురువారం చిట్యాల మండలంలోని పలు పాఠశాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, అకడమిక్ కమిటీ కన్వీనర్ పగిడిపాటి నర్సింహ, మండల అధ్యక్షుడు బొప్పని యాదయ్య, కార్యదర్శి ఏశమల్ల నాగయ్య, దాసరి శ్రీరాములు పాల్గొన్నారు.

మర్రిగూడ : ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్న మాణిక్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ నాయకులు గురువారం మండలంలోని శివన్నగూడ, కుదభాక్షపల్లి, దామెరభీమనపల్లి పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేష్, జిల్లా కార్యదర్శులు గ్యార నరసింహ, కాశిరెడ్డి కృష్ణారెడ్డి, నలపరాజు వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కట్టంగూర్ : ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం గ్రామాల్లో కల్పిస్తున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కట్టంగూర్ ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య కోరారు. కట్టంగూర్‌లోని పెద్ద చెరువులో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను గురువారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ పోరెళ్ళ సునీత, ఎంపీఓ ఎండీ. అథర్ పర్వేజ్, సర్పంచ్ చెనగోని సతీష్, ఏపీఓ కె.రామ్మోహన్ ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ ధర్మా

చిట్యాల : విద్యార్థులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని అన్ని రకాల క్రీడల్లో రాణించాలని చిట్యాల ఎస్‌ఐ నకిరెకంటి ధర్మా అన్నారు. చిట్యాలలోని కేటీఎస్ స్కూల్‌లో ఏ ఫెస్ట్ ఆఫ్ టెక్ అండ్ కల్చరర్ ఈవెంట్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తి, పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కె.శ్రీధర్, ప్రిన్సిపాల్ బి.యాదగిరిగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భాషా ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవాలి

చిట్యాల : పాఠశాల స్థాయిలోని విద్యార్థులు వివిధ భాషల్లో ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌సీఈఆర్‌టీ(స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్) స్టేట్ మానిటరింగ్ సభ్యులు నన్నూరి ఉపేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వనిపాకల గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు రాపోలు శ్రీనివాస్ చొరవతో వశిష్ట యూట్యూబ్ చానల్ ద్వారా ఏర్పాటు చేసిన 95 స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను గురువారం పాఠశాలలో విద్యార్థులకు వారు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఇంగ్లిష్‌లో నైపుణ్యం సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దంతూరి సైదులు గౌడ్, ఉపాధ్యాయులు రాపోలు శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి, మల్లేష్, సరిత, ఇమామ్ కరీం, శోభారాణి పాల్గొన్నారు.

కళాశాల పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

రామగిరి(నల్లగొండ) : జిల్లా కేంద్రంలో 120 గదులతో నిర్మిస్తున్న ఎన్జీ కళాశాల నూతన భవన పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, బీఆర్‌ఎస్ నాయకుడు చీర పంకజ్‌యాదవ్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు తీగల జాన్‌శాస్త్రి, కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్, మహ్మద్‌సమీ, బోయినపల్లి శ్రీనివాస్, జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి



నకిరేకల్ : పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : గడువులోగా 100 పడకల వైద్యశాల, సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. నకిరేకల్‌లో రూ.32 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల వైద్యశాల భవనం, రూ.26 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణపై చైతన్యం తీసుకురావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : ప్లాస్టిక్ నియంత్రణపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ నల్లగొండ ఆధ్వర్యంలో ఓడీఎఫ్ ప్లస్, గ్రామ పారిశుద్ధ్య ప్రణాళిక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణతోపాటు నీటి నిర్వహణ, ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఓడీఎఫ్ ప్లస్ జిల్లా కో ఆర్డినేటర్ శరత్‌బాబు ఆధ్వర్యంలో ఓడీఎఫ్ నుంచి ఓడీఎఫ్ ప్లస్, ఏడీఎఫ్ సుస్థిరత, ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. నీటి నిర్వహణపై రిసోర్స్ పర్సన్ నర్సింహాచారి శిక్షణ ఇచ్చారు. ఈ నెల 10వ తేదీన ఎనుగులదోరి గ్రామ పంచాయతీలో సర్వే నిర్వహించి, గ్రామ పారిశుద్ధ్య ప్రణాళిక తయారు చేస్తామని తెలిపారు. ముందుగా ఎంపీపీ నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కో ఆర్డినేటర్ మెహినోద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరిగౌడ్, ఎంపీఓ సత్యనారాయణ, ఎంపీఎం శ్రీనివాస్, ఏపీఓ యాదయ్యలతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, వీఏఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

మునుగోడు : ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ కర్నాటి స్వామి అన్నారు. మునుగోడు మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఎస్.నాగరాజు బదిలీపై వెళ్తుండడంతో ఆయనను గురువారం కార్యాలయంలో సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జానయ్య, ఎంపీఓ సుమలత, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణారెడ్డి, ఏపీఓ శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఏకం కావాలి

కేతేపల్లి : హక్కుల సాధన కోసం యాదవులు ఏకం కావాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తిరుగుడు రవి అన్నారు. మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన తిరుగుడు రవి.. సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గురువారం కేతేపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం రవి మాట్లాడుతూ యాదవుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మ వెంకటనర్సయ్యయాదవ్, సంఘం మండల అధ్యక్షుడు వీరబోయిన గురుస్వామి, నాయకులు బయ్య ముత్తయ్య, జటంగి రాంచంద్రయ్య, ఉప్పల సోమలింగం, జటంగి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రమౌళి మృతి



శాలిగౌరారం : మండలంలోని గురుజాల గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మారోజు చంద్రమౌళి(59) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, మల్లేష్, నారి అయిలయ్య, ములకలపల్లి రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, బొజ్జ చిన వెంకులు, జిట్ట నగేశ్‌లు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

కరాటే శిక్షణ ప్రారంభం

రామగిరి(నల్లగొండ) : ఆత్మరక్షణకు కరాటే అవసరమని తిప్పర్తి ఎస్‌ఐ వాస ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం తిప్పర్తి ప్రభుత్వ బాలుర పాఠశాలలో షొటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రధానోపాధ్యాయురాలు వెంకటమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణకు కరాటే ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ నాంపల్లి కనకారావు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో చేపడుతున్న సుందరీకరణ పనులు, రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం నీలగిరి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా మిర్యాలగూడ రోడ్డులో, పెద్దబండ ప్రాంతాల్లో చేపడుతున్న రహదారి విస్తరణ, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. అవసరమైతే కూలీలను పెంచి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. డివైడర్‌లలో ఉన్న మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న నిరాశ్రయుల భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు అశోక్‌కుమార్, నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజా, సురిగి శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజగోపుర ప్రతిష్ఠాపన ఉత్సవాలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శాలిగౌరారం : మండలకేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం వద్ద దాతలు రామగిరి గ్రామానికి చెందిన చామల రాంరెడ్డి-సృజన వారి కుమారుడు చామల వీరేశ్‌రెడ్డి-వాణి సహకారంతో నిర్మించిన ముఖద్వార రాజగోపుర కలశ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. మూడు రోజుల క్రితం ప్రారంభమైన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం ఆలయ అనువంశిక ధర్మకర్తలు శేషబట్టర్ జగన్మోహనాచార్యులు, డాక్టర్ లక్ష్మణమూర్తిచార్యులు, నర్సింహాచార్యులు, రామచంద్రాచార్యులు, రత్నమాచార్యుల నేతృత్వంలో శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తుల శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను అశ్వవాహనంపై ఊరేగించారు. స్వామివారి కల్యాణోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల సందర్భంగా రాజగోపుర నిర్మాణ దాతలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న వంగూరు రాములు

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం 2022 మార్చిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించిన విధంగా భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వంగూరు రాములు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో రూ.3700 కోట్లు మూలుగుతున్నా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను క్లియర్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం ప్రకారం కార్మికుల పేర్లను నమోదు చేసి గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కంచి కేశవులు, అద్దంకి నర్సింహ, బి.సైదులు, బైరం దయానంద్, వడ్డెపల్లి శంకర్, వెంకటయ్య, శ్రీకాంత్, సైదులు, శివకృష్ణ, ఇన్నయ్య, కాశమ్మ, రాంబాబు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన ఎలక్ట్రీషియన్ బత్తిని రవి ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడడంతో చిరుమర్తి చేయూత ఫౌండేషన్ చైర్మన్ చిరుమర్తి మనోజ్‌కుమార్ గురువారం రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఎంపీటీసీలు దుబ్బాక పావని శ్రీధర్, వాజిద్‌అలీ, నాయకులు దేవేందర్, పుల్లెంల మహేష్, జినకల కార్తిక్, బాబా తదితరులు ఉన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ టూటౌన్ : కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం ఎన్జీ కళాశాల ఎదుట ప్రధానిమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలపై కక్ష గట్టి ఐటీ, ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వస్తుండడంతో జీర్ణించుకోలేని మోదీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి చల్లా కోటేష్, పెరిక దివాకర్, అశోక్, బి. లింగస్వామి, శేఖర్, కోటేశ్వర్ రావు, చంద్రశేఖర్, శివకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కట్టంగూర్ : యాసంగిలో సాగు చేసిన వరి పంటలో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవాలని కట్టంగూర్ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పొలాలను గురువారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పొలంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పైరులో అగ్గి తెగులు, కాండం కుళ్లు తెగులు వచ్చే అవకాశముందన్నారు. వాటి నివారణకు అధికారులను సంప్రదించి, మందులు పిచికారీ చేయాలన్నారు. రైతులకు పంటసాగు విషయంలో ఎలాంటి సలహాలు, సూచనలు కావాలన్నా క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలన్నారు.

టీజీఓ అధ్యక్షురాలికి సన్మానం



మమతను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ : టీజీఓ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఓ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు మమతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వెంకట్, నాయకులు కృష్ణ, వెంకటయ్య, లావణ్య పాల్గొన్నారు.

సరస్వతీ దేవి విగ్రహం ధ్వంసం

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతీ అమ్మవారి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం, బుధవారం శ్రీ నీలకంఠరామస్వామి రథోత్సవం, హోలీ సందర్భంగా పాఠశాలకు సెలవులు ప్రకటించారు. గురువారం ఉదయం ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చేసరికి విగ్రహం ధ్వంసమైనట్లు గుర్తించారు. దీంతో విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఎంసీ చైర్మన్‌తో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు జనార్దన్ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కేతేపల్లి : మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన యాగలి పాపయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఇటీవల చికిత్స పొందాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.40వేల విలువ గల చెక్కును సర్పంచ్ కట్ట శ్రవణ్ గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆర్.భద్రయ్య, నాయకులు చిలుకూరు చిరంజీవి, ఎ.లింగయ్య, యాగలి గోపి పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



చండూరు : మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చండూరు ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్ దంపతులు తమ సొంత ఖర్చులతో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న చండూరు ఎంపీపీ పల్లె కళ్యాణి, నాయకులు